హైదరాబాద్ అభివృద్ధికి ఢోకా లేదు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాదాపూర్, జూన్ 15 : తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అనువైనదిగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రాపర్టీ షో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో సొంతింటిని కొనుగోలు చేయాలనే కల ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువైనదని చెప్పారు. హైదరాబాద్ స్థానం హైదరాబాద్‌కే ఉందని, చంద్రబాబు నాయుడు అమరావతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. హైదరాబాద్ డెవలప్‌మెంట్ విషయంలో ఆర్‌ఆర్‌ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు), మెట్రో డెవలప్‌మెంట్, మూసీ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ విషయంలో కూడా కంపెనీలు ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకునేందుకు మరో రెండు రోజుల్లో ఈ అంశాలపై చర్చలు జరుపనున్నట్లు చెప్పారు. పక్క రాష్ట్రంలో వేరే ప్రభుత్వం వచ్చిందని, మన వద్ద ఏదో జరుగుతుందని అపోహ పడవద్దని, బిల్డర్‌లకు న్యాయమైన అన్ని అంశాల్లో అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

హైదరాబాద్‌కు ఎటువంటి నష్టం జరగదు..

ఏపీలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెట్టుబడులన్నీ అమరావతికి తరలిపోతాయని, హైదరాబాద్‌లో భూముల ధరలు తగ్గిపోతాయని 10 రోజులుగా ఒక రకమైన చర్చ జరుగుతున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అమరావతికి పెట్టుబడులు వస్తే రావొచ్చేమో కాని హైదరాబాద్‌కు నష్టం వస్తుందనేది మాత్రం ఒక అపోహ మాత్రమేనన్నారు. హైదరాబాద్ భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదని చెప్పారు. ఎందుకంటే ఈ నగరానికి ఉన్న భౌగోళిక వనరులు, ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలే అందుకు కారణమన్నారు. ఇప్పటికే దేశ, విదేశాల దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకొని పని చేస్తున్నట్లు తెలిపారు. ఆదిబట్లలో అతి త్వరలో ఫాక్స్‌కాన్ కార్యకలాపాలు ప్రారంభించబోతుందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణకే గేమ్ ఛేంజర్ లాంటిదని మంత్రి పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఫార్మాసిటీ, సెమీ కండక్టర్ పాలసీ, హెల్త్ సెక్టార్, పర్యాటక రంగాల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు.

శివారు గ్రామాలన్నీ హైదరాబాద్ పరిధిలోకి..

ఓఆర్‌ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. శివారు ప్రాంతాల్లోని మరిన్ని గ్రామాలు హైదరాబాద్ నగరం పరిధిలోకి రానున్నాయన్నారు. ఇవన్నీ అంశాలు కూడా హైదరాబాద్ అభివృద్ధితో పాటు సొంతిళ్లు నిర్మాణం చేసుకుని స్థిరపడటానికి, వ్యాపారం చేసుకొని ఎదగడానికి పుష్కలంగా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పలు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలకు చెందిన వారు స్టాల్స్ ఏర్పాటు చేశారు.

గొట్టిముక్కల పాఠశాలను సందర్శిస్తున్న డీఈవో రేణుకాదేవి

పనులు పూర్తి చేయాలి

డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, జూన్ 15 : అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. శనివారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజనం, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫామ్స్, హాజరు శాతాన్ని పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులున్నారు.

కన్హా శాంతివనంలో సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నర్సింహ
- కన్హా శాంతి వనంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన

నందిగామ, జూన్ 15 : నందిగామ మండలం కన్హా శాంతి వనంలో సైబరాబాద్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సైబర్ క్రైం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం సైబర్ క్రైంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నర్సింహ తన బృందంతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైంతో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ రవీంద్రారెడ్డి, ఎస్సీఎస్సీ జాయింట్ సెక్రటరీ అభిషేక్ కుమార్, డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, సీనియర్ మేనేజర్ భానుమూర్తి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణ సదుపాయం కల్పిద్దాం


రామోజీరావు మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న గాంధీ, సంఘం ప్రతినిధులు

మియాపూర్ , జూన్ 15 : కమ్మ సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ బ్యాంకును స్థాపించి, ఈ వర్గానికి చెందిన పేద విద్యార్థులకు విద్యా రుణాలు అందించి తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే, కమ్మ సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అరెకపూడి గాంధీ అన్నారు. కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం సమాఖ్య గౌరవాధ్యక్షుడు సీవీ రావు , రాష్ట్ర అధ్యక్షుడు అరెకపూడి గాంధీ అధ్యక్షతన శనివారం అమీర్‌పేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల సంతాపం తెలిపి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు తిరిగి ఎన్నికవ్వడాన్ని హర్షిస్తూ అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కమ్మ సేవా సంఘానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 5 ఎకరాల స్థలం ధరను నిర్ణయించేందుకు ప్రభుత్వాన్ని సంప్రదించడం, కోర్టు కేసు ఉపసంహరించుకొని త్వరలో భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ బ్యాంకును స్థాపించి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, అవసరమైన వారికి రుణ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు అడుసుమిల్లి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ నాగభూషణం, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ వివాహ పరిచయ వేదిక

సిటీబ్యూరో, జూన్ 15(నమస్తే తెలంగాణ): సద్గురు విశ్వకర్మ– విశ్వబ్రాహ్మణ సమైఖ్య అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి విశ్వకర్మ కులస్తులు పాల్గొననున్నట్లు తెలిపారు. సంఘం ద్వారా ఇప్పటివరకు 297 వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

సంజీవయ్య పార్కులో యోగా వేడుకలు

సిటీబ్యూరో, జూన్ 15(నమస్తే తెలంగాణ) : జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలోని సంజీవయ్య పార్కులో తెలంగాణ యోగా అధ్యయన పరిషత్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించనున్నారు. జూన్ 18 నుంచి 21 వరకు జరగనున్నాయి. ముగింపు రోజున జరిగే వేడుకల్లో అంతర్జాతీయ యోగా నిపుణులు, ప్రముఖులు, రాజకీయ నేతలు పాల్గొననున్నారు. వెయ్యికి పైగా యోగా అభ్యాసకులతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పీవీ మార్గ్‌లోని సంజీవయ్య పార్కు ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలతోపాటు, పలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ యోగా అధ్యయన పరిషత్ సెక్రటరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

కొండాపూర్, జూన్ 15 : నల్లగండ్ల లక్ష్మీ విహార్ ఫేజ్ –1లో మహిళ గొంతు కోసి హత్యకు పాల్పడిన నిందితుడిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్స్పెక్టర్ పాలవెల్లి శనివారం వివరాలు వెల్లడించారు. లింగంపల్లి కానుకుంటలో నివాసం ఉండే యాపచెట్టుకాడి భరత్ గౌడ్, అలియాస్ శ్రీనుకు నల్లగండ్లలో నివాసం ఉండే విజయలక్ష్మి (35)తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి కారణమైంది. కాగా విజయలక్ష్మి తన సోదరుడి కోసం భరత్‌గౌడ్ వద్ద డబ్బులు తీసుకుంది. కొద్దిరోజుల తర్వాత భరత్‌ను దూరం పెట్టి వేరే వాళ్లతో సన్నిహితంగా మెలగడం మొదలుపెట్టింది. భరత్ పలుమార్లు హెచ్చరించిన పద్ధతి మార్చుకోలేదు. భరత్ భార్య సైతం వివాహేతర సంబంధంపై కేసు పెట్టింది. దీంతో కక్ష పెంచుకున్న భరత్‌గౌడ్ ఎలాగైన విజయలక్ష్మిని చంపేయాలని నిశ్చయించుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నల్లగండ్లలోని ఆమె నివాసానికి విజయలక్ష్మి చిన్నకొడుకు ముందే ఆమెను కిరాతకంగా గొంతుకోసి హతమార్చాడు. అనంతరం చందానగర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకుని భరత్‌గౌడ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు.

పోలీసు బందోబస్తు మధ్య డబ్బాల తొలగింపు

- 10 రోజుల్లో టెండర్ల ద్వారా లబ్ధిదారులకు అప్పగిస్తాం
- ఆర్టీసీ డీఎం భక్షీనాయక్

గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో జేసీబీతో తొలగించిన డబ్బా

మర్పల్లి, జూన్ 15 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న స్థలంలో డబ్బాలను శనివారం అధికారుల సమక్షంలో తొలగించినట్లు ఆర్టీసీ డీఎం భక్షీనాయక్ తెలిపారు. కొందరు బస్టాండ్ స్థలంలో ఇష్టానుసారంగా ఎక్కువ స్థలం స్వాధీనపర్చుకుని కొన్నేండ్లుగా ఆర్టీసీకి ఎలాంటి రుసుము చెల్లించకుండా డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారని ఆయన తెలిపారు. డబ్బాలను తొలగించాలని పలుమార్లు డబ్బాల యజమానులకు నోటీసులు అందించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసుల సహకారంతో శనివారం డబ్బాలను తొలగించేందుకు ప్రయత్నించారు. డబ్బాల నిర్వాహకులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు పోలీస్ బందోబస్తు మధ్య ఓ డబ్బాను జేసీబీతో తొలగించారు.

ఆర్టీసీ అధికారులు, పోలీసులతో గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. జేసీబీతో తొలగిస్తే చిరు వ్యాపారస్తులకు నష్టం జరుగుతుందని.. వారే స్వచ్ఛందంగా తీసుకుంటారని దీంతో నష్టం జరుగదని తెలిపారు. గత కొన్నేండ్లుగా డబ్బాలను ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా లబ్ధిపొందుతూ వారి కుటుంబాలు జీవిస్తున్నాయని, టెండర్లు వేయకుండా ప్రస్తుతం ఉన్న వారికే స్థలాలను కేటాయించాలని గ్రామ పెద్దలు అధికారులను కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి డబ్బాల యజమానులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో డబ్బాలను తొలగించి ఆర్టీసీ అధికారుల సూచనల మేరకు టెండర్ల ద్వారా స్థలాలను దక్కించుకుని డబ్బాలను ఏర్పాటు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీకే రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌చార్జి టీఎం దాస్, ఆర్టీసీ సిబ్బంది ఎల్లయ్య, సుదర్శన్, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ ఏర్పాటు చేయండి

సిటీబ్యూరో, జూన్ 15(నమస్తే తెలంగాణ): వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో వినియోగదారుల కమిషన్లను తక్షణమే ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు డా. చంద్రప్రకాశ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాల ప్రతిపాదికన రాష్ట్రంలో ఉన్న 12 కమిషన్ల సంఖ్యను వెంటనే పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా కోర్టులు ఏర్పాటు చేసిన ట్టుగానే జిల్లా కోర్టుల ప్రాంగణాల్లో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనూ వినియోగదారుల కమిషన్లను ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన జనాభా దృష్ట్యా వినియోగదారులకు న్యాయం జరగడం లేదని, భారీగా పెరిగిన కేసుల దృష్ట్యా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం సత్వరమే స్పందించి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కాకుండా... జిల్లా కొక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

'కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి'

కులగణన చేపట్టాలని నినదిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15 : రాష్ట్రంలో వెంటనే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని టీఎస్‌జేఏసీ వ్యవస్థాపకుడు అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేసిందని గుర్తు చేశారు. దీనిని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సిద్ధరామయ్య సమక్షంలో విడుదల చేశారన్నారు. అందులో పేర్కొన్న విధంగా అసెంబ్లీలో వెంటనే కులగణన బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహా ధర్నాకు మద్దతుగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బైక్ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ.. కులగణన విధి విధానాల కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా, బీహార్‌లో జరిగిన విధంగా కులగణనతో కూడిన జనగణను ఆదర్శంగా తీసుకుని సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆలకుంట హరి, యునైటెడ్ పూలే ఫ్రంట్ విద్యార్థి నాయకులు లింగం, రాంబాబు, వీరు, చంద్రశేఖర్, వీరేంద్ర, శేఖర్, శ్రవణ్, శరత్, లెనిన్, గణేశ్, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ద్వానా శాస్త్రి గొప్ప సాహిత్యవేత్త

జి.వల్లీశ్వర్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న డా.కేవి.రమణాచారి

రవీంద్రభారతి,జూన్15 : ద్వానా శాస్త్రి గొప్ప సాహిత్యవేత్త అని డాక్టర్ కె.వి రమణాచారి కొనియాడారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ , ద్వానా సాహితీ కుటీరం ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ డా.ద్వానా శాస్త్రి 77వ జయంతి సందర్భంగా ప్రముఖ రచయిత, సంపాదకుడు జి.వల్లీశ్వర్‌కు కిన్నెర –ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం బహుకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి హాజరై డా. ద్వానా శాస్త్రి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జి.వల్లీశ్వర్‌కు కిన్నెర –ద్వానా శాస్త్రి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. ద్వానా శాస్త్రి మహనీయుడు, మానవతావాది అని తెలిపారు. ద్వానా శాస్త్రి స్మారక పురస్కారం రచయిత జి.వల్లీశ్వర్‌కు బహుకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, శ్రీ శంకర్‌నారాయణ, ద్వానా శాస్త్రి కుమారుడు ద్వాదశి శశికాంత్, ముద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

'రెండేండ్ల గడువు పొడిగించాలి'

ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 2018 బ్యాచ్‌కు చెందిన పీహెచ్‌డీ విద్యార్థులకు రీసర్చ్ ప్రోగ్రెస్ సెమినార్ నిర్వహించేందుకు గడువును రెండేళ్లు పొడిగించాలని పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కరోనా కారణంగా రెండు విద్యా సంవత్సరాలు కోల్పోయినందున, యూజీసీ నిబంధనల ప్రకారం గడువు కల్పించి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నికలు, సుదీర్ఘకాలం తరువాత పోటీ పరీక్షల నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధమవుతున్నారని గుర్తు చేశారు. ఈ కారణాల నేపథ్యంలో గడువును పొడిగించాలని విద్యార్థులు కోరారు.

అభినందనల వెల్లువ

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పదవులను స్వీకరించిన మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలను శనివారం భవన్‌లో టీఎన్జీవో డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్షుడు మామిడి ప్రభాకర్, యూనిట్ సభ్యులు హరి, చంద్రశేఖర్, విష్ణువర్ధన్ కలిసి సన్మానించారు.

- సుల్తాన్‌బజార్, జూన్ 15

హలో సార్..

జలమండలిలో 'డయల్ యువర్ ఎండీ' పునఃప్రారంభం

గంటన్నర పాటు కార్యక్రమం.. 6 ఫోన్ కాల్స్..

తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఎండీ ఆదేశం

ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఎండీ' ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎండీ సుదర్శన్‌రెడ్డి , ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో పునః ప్రారంభించిన 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. శనివారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి.. వినియోగదారుల నుంచి నేరుగా ఫోన్ కాల్స్‌ను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలను తక్షణమే సంబంధిత డీజీఎంలు, మేనేజర్లు సందర్శించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ అవతల, ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల నుంచి కొత్త కనెక్షన్ల కోసం ఫోన్లు చేశారు. ఈ పరిధిలో ఓఆర్ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టులో భాగంగా రిజర్వాయర్లు పూర్తి కాగా, డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే కనెక్షన్లు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని గంటన్నర పాటు నిర్వహించారు. మొత్తం 36 మంది వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారని అధికారులు తెలిపారు. ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, నాగోల్, షేక్‌పేట, ఓల్డ్ సిటీ, గౌలిపురా, బాలానగర్, నాంపల్లి ప్రాంతాల నుంచి ఫోన్లు చేసి సమస్యలను వివరించారు. ఎక్కువగా తాగునీటి సరఫరా, కలుషిత నీరు, లో ప్రెషర్, సీవరేజీ ఓవర్ ఫ్లో, పైపులైన్ల నుంచి లీకేజీలు, డ్రైనేజీ వంటి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఈడీ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీ.ఎల్.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బెంగళూరులో దక్షిణ్ భారత్ ఉత్సవ్-2024

బెంగళూరులో జరిగిన దక్షిణ్ భారత్ ఉత్సవ్–2024లో తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ హెచ్.కె.పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక వివరాల సమాచారాన్ని పర్యాటక శాఖ ప్రతినిధులు కె.అంజిరెడ్డి, ఎస్.ప్రభాకర్ ఆయనకు అందజేశారు.

- సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ)

బహుళ అంతస్తుల అనుమతుల కమిటీ సమావేశం

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి సంబంధించిన కీలక సమావేశం శనివారం అమీర్‌పేటలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో జరిగింది. 10 అంతస్తుల పైబడి హెచ్ఎండీఏ పరిధిలో నిర్మించే బహుళ అంతస్తుల భవనాల(మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్)కు అనుమతులిచ్చే అంశంపై ఈ కమిటీ సమావేశమై పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఎంఎస్‌బీల కేటగిరిలో వచ్చే దరఖాస్తు కమిటీ పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికి ఆమోదం తెలుపుతుంది. తాజాగా జరిగిన కమిటీ సమావేశంలో పదికి పైగా ఉన్న ఎంఎస్‌బీలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో ఎక్కువగా 25 నుంచి 54 అంతస్తుల భవనాలకు సంబంధించిన దరఖాస్తులున్నాయని ప్లానింగ్ విభాగం అధికారి ఒకరు తెలిపారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలతో పాటు భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పెరుగుతున్నాయని, వాటికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, భవిష్యత్ పరిణామాలపై ఈ కమిటీ చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.